ధర్మఘంట

# పిలుస్తోంది...మేడారం జన జాతర...!



గంట సోమన్న
సీనియర్ జర్నలిస్ట్.

తెలంగాణలో భక్తి మరియు సాంస్కృతిక వారసత్వంగా అత్యంత ప్రసిద్ధి చెంది, మేడారం జాతరగా పిలవబడే సమ్మక్క సారలమ్మ జన జాతరకు సర్వం సిద్ధమవుతుంది.ఇది తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో రెండేళ్లకు ఒకసారి జరిగే అతిపెద్ద ఆదివాసీ పండుగ.భారతదేశంలో జరిగే అతిపెద్ద కుంభమేళా తర్వాత రెండవ అతిపెద్ద మేళాగా జరిగే ఈ సమ్మక్క సారలమ్మ జన జాతర ప్రపంచంలోని అతిపెద్ద ఆదివాసీ సమావేశాలలో ఒకటిగా రికార్డ్ సృష్టించింది. ఈ జాతర ఆదివాసీ దేవతలు సమ్మక్క మరియు సారలమ్మలను గౌరవించడానికి జరుపుకుంటారు.ఇది ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ మాసంలో (ఫిబ్రవరి) పూర్ణిమ రోజున జరుగుతుంది.అయితే 2026 లో ఈ జాతర జనవరి 28 నుండి 31 వరకు జరగనుంది.ఈ సారి గతం కంటే అధికంగా మిలియన్ల మంది భక్తులను ఆకర్షిస్తుందని అంచనాలు ఉన్నాయి.

**చరిత్ర మరియు ఇతిహాసం**

ఈ జాతర చరిత్ర 13వ శతాబ్దానికి చెందినది, కాకతీయుల కాలంలో జరిగిన ఒక యుద్ధాన్ని స్మరించుకుంటుంది.ఆదివాసీ కథల ప్రకారం,కొంతమంది ఆదివాసీ నాయకులు వేటకు వెళ్లినప్పుడు,పులుల మధ్య ఆడుకుంటున్న ఒక నవజాత శిశువు (సమ్మక్క)ను చూశారు.ఆమె చుట్టూ అద్భుతమైన కాంతి అవహించి ఉందని,ఆమెను ఓ ఆదివాసీ నాయకుడు దత్తత తీసుకుని పెంచాడని, ఆ తర్వాత ఆమె కోయా ఆదివాసీల రక్షకురాలిగా మారిందని చెప్పుకుంటారు. ఇక సమ్మక్కను కాకతీయుల ఫ్యూడటరీ చీఫ్ పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు.వారికి సారలమ్మ (సరక్క),నాగులమ్మ మరియు జంపన్న అనే పిల్లలు కలిగారు.కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు కరువు కాలంలో ఆదివాసీలపై అన్యాయమైన పన్నులు విధించాడు.సమ్మక్క మరియు ఆమె కుటుంబం ఈ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారు.ఆ యుద్ధంలో సారలమ్మ, జంపన్న మరియు పగిడిద్ద రాజు మరణించగా,సమ్మక్క యుద్ధభూమి నుండి అదృశ్యమై అడవిలోకి వెళ్లి దేవతగా మారిందని నమ్ముతారు.

మేడారం జన జాతర నేపథ్యం

ఈ జాతర పూర్వం బయ్యక్కపేటలో జరిగేది.కానీ, 1935లో కరువు మరియు వనరుల లోపం కారణంగా మేడారంకు మార్చబడిందని చెబుతారు.ఆ తర్వాతే ఆధునిక పరిస్థితి మరియు ప్రాముఖ్యతను సంతరించుకుందని ప్రతీతి.కోయా ఆదివాసీల సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే "సమ్మక్క సారలమ్మ"జాతర 2026లో జనవరి 28 నుండి 31 వరకు జరగనుంది.ఈ నాలుగు రోజుల పండుగలో దేవతలను అడవి నుండి మేడారం గద్దెల వద్దకు తీసుకువచ్చి ఆదివాసీ పూజారులు పూజలు చేస్తారు. ఇక్కడకు తెలంగాణ ప్రాంతం నుండే కాకుండా దేశంలోని ఆదివాసీలూ హాజరై అత్యంత భక్తిశ్రద్ధలతో తమ వనదేవతలను కొలుచుకుంటారు.అందుకే ఇది భక్తి,సాంస్కృతిక మరియు సామాజిక ప్రాముఖ్యత కలిగి ఉందని చెప్పాలి.ఈ జాతరలో ఆదివాసీ సంప్రదాయాలు, నృత్యాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తుంది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం దీనిని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. అప్పటినుండి రాష్ట్రప్రభుత్వం మరియు ఆదివాసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సహకారంతో ఈ జాతర జరుగుతుంది.2012లో సుమారు 10 మిలియన్ల మంది భక్తులు సందర్శించారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.

సవాళ్లు మరియు భవిష్యత్ అంచనాలు

ఈ జాతరలో భారీ సమూహాలు ఉండటం వల్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాన్స్‌పోర్ట్ మరియు పర్యావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ బిల్డింగ్‌లు మరియు సౌకర్యాలు అభివృద్ధి చేస్తోంది.భవిష్యత్‌లో ఈ జాతరను ప్రపంచ స్థాయిలో ప్రమోట్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.కానీ,కొంతమంది ఇది ఆదివాసీల వారసత్వం మూలాలపై ఆధిపత్యానికి గండి కొడుతుందని ఆరోపిస్తున్నారు. ఆదివాసీ సంస్కృతిని సంరక్షించడానికి,సమ్మక్క సారలమ్మ జాతర భక్తి, పోరాటం మరియు సాంస్కృతిక వారసత్వాన్ని సూచిస్తుందని,ఇది ఆదివాసీల ధైర్యాన్ని గుర్తుచేస్తుందని,తెలంగాణ యొక్క సాంస్కృతిక గుర్తింపును బలపరుస్తుందని అభిప్రాయపడుతున్నారు.అభిప్రాయాలు,ఆలోచనలు ఎలా ఉన్నప్పటికీ 2026 జాతర ఆదివాసీల సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందిస్తుందని, మిలియన్ల మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభవాన్ని అందిస్తుందని ఆశిద్దాం.

# రోడ్డు భద్రత పట్ల ఉద్యోగులు పౌరులను ప్రభావితం చేయాలి

## సూర్యాపేట డిఎస్పీ ప్రసన్న కుమార్





ధర్మఘంట జనవరి 16 సూర్యాపేట:

ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల వల్ల ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని, రోడ్డు ప్రమాదం మరణాలను తగ్గించడంలో ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా ఉండాలని,రోడ్డు భద్రత పట్ల సామాన్య ప్రజలను, పౌరులను, యువతను ప్రభుత్వ ఉద్యోగులు ప్రభావితం చేయాలని డిఎస్పీ ప్రసన్నకుమార్ కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోడ్డు భద్రత మహోత్సవాలు, పోలీసు అధ్వర్యంలో నిర్వహిస్తున్న' 'అరైవ్-ఎలైవ్"కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం నందు పట్టణ, ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత, అరైవ్-ఎలైవ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ...ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,హైస్పీడ్ తో వాహనాలు నడపరాదని, పిల్లలకు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని సూచించారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కార్యక్రమాల పట్ల ఉద్యమంలా సాగుతున్న అవగాహన కార్యక్రమాల్లో ఉద్యోగులు, పౌరులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.రోడ్డు భద్రత పట్ల నియమ నిబంధనలు పాటిస్తూ,ప్రమాద రహితంగా వాహనాలు నడుపుతామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ఆర్ఎంఓ లక్ష్మణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, టౌన్ ఎస్ఐలు మహేంద్రనాథ్, శివతేజ, ఐలయ్య, ఏఎంవిఐ విక్రమ్,ఏఎంవిఐ సంపత్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలతో సమన్వయం

## అరైవ్-అలైవ్ ముఖ్య లక్ష్యమే సురక్షిత ప్రయాణం.. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ధర్మఘంట జనవరి 16 రామగుండం

అరైవ్-అలైవ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమేనని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.కరీంనగర్ జిల్లా రామగుండం మున్సిపల్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ,ప్రజల,వాహనదారుల ప్రాణాల రక్షణే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన" అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా డీసీపీ బి.రామిరెడ్డి, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో మున్సిపల్,విద్య, రోడ్డు రవాణా,ఆరోగ్య,ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులకు, ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యతపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ,పెద్దపల్లి డీసీపీ బి.రామిరెడ్డి లతో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో సమన్వయం చేస్తున్నామని,రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడాదికి 30 శాతం ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అందులో భాగంగా మున్సిపల్, విద్య,ఆరోగ్య,రోడ్డు రవాణా, ఆర్టీసీ అధికారులు,ఉద్యోగులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పై ప్రజలకు అవగాహన కల్పించేలా చొరవ చూపాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సమన్వయంతో అవగాహన కల్పించడం జరుగుతుందని,ఇందుకోసం ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటిస్తూ వాహనాలు నడపడం,సేఫ్ అండ్ డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులు అనుసరించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్ ఇతర ఫోర్ వీల్ నడిపే వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు.అలాగే ప్రతి



వాహనదారుడి వద్ద డ్రైవింగ్ లైసెన్స్,వాహన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ వంటి వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని,ఇవి చట్టపరంగానే కాకుండా ప్రమాద సమయంలో ఆర్థిక భద్రతను కూడా కల్పిస్తాయన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, వారి బాధ్యతాయుత ప్రవర్తనతో సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు సిపి హెల్మెట్ లను పంపిణీ చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఏసీపీ జి.కృష్ణ,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ఎంఇఓ మల్లేష్,సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కృపాభాయ్,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ సాగర్,రోడ్లు అండ్ భవనాల శాఖ ఎస్ఐ రమేష్, అనూష,ట్రాఫిక్ ఎస్ఐలు హరిశేఖర్,రామరాజు,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనాజీపురం గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
మోత్కూర్ ఎస్ఐ సతీష్ కుమార్



ధర్మఘంట జనవరి 16 మోత్కూరు

రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవాల్సిన అత్యవసర జాగ్రత్తలు,ప్రాథమిక చికిత్స ప్రాముఖ్యతను గుర్తించాలని ఎస్ఐ సతీష్ కుమార్ అన్నారు.రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మెడికల్,హెల్త్ డిపార్ట్మెంట్ మరియు గ్రామ పంచాయితీ పాలక మండలి సంయుక్త సమన్వయంతో శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురం గ్రామంలో పోలీసులు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్లపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే ఏ విధంగా ప్రాణాంతకమవుతుందో, ముఖ్యంగా మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా తెలియజేశారు.అలాగే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్,కారు ప్రయాణంలో సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని,వేగ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉందని,పాదచారుల భద్రత,సురక్షిత డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ పాత్ర ఎంతో కీలకమని మెడికల్,హెల్త్ అధికారులు తెలిపారు.ప్రమాదం జరిగిన తొలి గంటలో అందించే వైద్య సహాయం ప్రాణాలను కాపాడగలదన్నారు.గ్రామస్థులు కార్యక్రమానికి స్పందిస్తూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ, ప్రమాదాల నివారణలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ త్రివేణి,ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్,ఏఎస్ఐ ఎం.వెంకన్న, పోలీసు సిబ్బంది,గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## విత్తన చట్టం,విద్యుత్ బిల్లు, విబిజీ రామ్ జీ పథకం,4 లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలి

రైతు,కార్మిక సంఘాలు, ఎస్కేఎం డిమాండ్
జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నిరసన



ధర్మఘంట జనవరి 16 సూర్యాపేట:


కార్మిక,రైతు, గ్రామీణ పేదలను నిరంకుశంగా అణిచివేసే,ఉపాధికి దూరం చేసే అభివృద్ధి నిరోధక బీజేపీ మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చి అమలుకు పూనుకుంటున్న ప్రజా వ్యతిరేక బిల్లులను తక్షణమే రద్దు చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్,ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతల రాంబాబు,ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిశెట్టి యాదగిరి, ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్న డిమాండ్ చేశారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద కార్మిక సంఘాలు,సంయుక్త కిసాన్ మోర్చ(ఎస్కేఎం)లు విత్తన చట్టం,విద్యుత్ బిల్లు,విబిజీ రామ్ జీ పథకం,4 లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేసి,రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాలను మోపడం అంటే ఇప్పటివరకు అమలు అవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడంలో భాగమేనని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు,వ్యవసాయ కూలీల ప్రయోజనాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకుని బీ జేపీ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రలకు పూనుకున్నదని మండిపడ్డారు. ఏడాదికి 125 రోజులకు పెంచామని చెప్పి, వ్యవసాయ సీజన్ లో 60 రోజులు పనులను నిషేదిస్తున్నట్లుగా ఉన్నదని, మిగిలినవి 65 రోజులేనని అన్నారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి,నాలుగు లేబర్ కోడ్ లుగా తేవడం కార్మిక వర్గానికి గొడ్డలి పెట్టు అని అన్నారు.విత్తన,విద్యుత్ బిల్లుల మూలంగా రైతులు తమకు నచ్చిన,తమ పొలాల్లో పండే విత్తనాలను ఎంచుకునే హక్కును హరించే కుట్రలో భాగంగా కార్పోరేట్ సంస్థలకు విత్తనాల ఎంపిక,మోటార్ లకు మీటర్లను బిగించే విద్యుత్ సంస్కరణ బిల్లులను తేవడం అన్యాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి నజీర్,ఇఫ్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు,పోలేబోయిన కిరణ్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు బండి రవి,వెంకట్ యాదవ్,టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు సుభాని, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారాలమ్మ జాతర పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచన

ధర్మఘంట జనవరి16 రామగుండం





ఈ నెల 28 నుండి 31 తారీకు వరకు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర మొదలయ్యే సమయానికల్ల అన్ని మౌలిక వసతులతో కూడిన పనులను ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సంబంధిత అధికారులకు సూచించారు.శుక్రవారం గోదావరి నది ఒడ్డున జరిగే సమ్మక్క సారాలమ్మ జాతర ఏర్పాట్ల పనులను ఆర్జీఎం లలిత్ కుమార్ తో కలసి ఎమ్మెల్యే పర్యవేక్షించారు.అనంతరం సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని, కైట్ ఎగురవేసి అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

ధర్మఘంట

## పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల



ధర్మఘంట జనవరి 16 మోత్కూరు

ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరగాలనే ఉద్దేశ్యంతో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సి.సతీష్ కుమార్ అన్నారు.శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పురపాలక సంఘ కార్యాలయ నోటీసు బోర్డుపై తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను మున్సిపల్ కమిషనర్ ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మోత్కూరు పురపాలక సంఘ పరిధిలో మొత్తం 12 వార్డులకు గాను 26 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఓటర్లకు తుది పోలింగ్ స్టేషన్ల జాబితా నోటీసు బోర్డుపై ప్రదర్శించడంతో పాటు,ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ వివరాలను ముందుగానే పరిశీలించి,ఎన్నికల రోజున ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోత్కూరు పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ కంట్రోల్ రూమ్ పరిశీలించిన ఎస్పీ కె.నరసింహ

**కంట్రోల్ రూమ్ విధులు చాలా కీలకం**

**పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు**



ధర్మఘంట జనవరి 16

సూర్యాపేట:పోలీస్ సిబ్బందిని సమన్వయం చేయడంలో పోలీస్ కంట్రోల్ రూమ్ విధులు చాలా ముఖ్యమైనవని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ సెంట్రల్ కంట్రోల్ రూమ్,పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల పనితీరును శుక్రవారం ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు,సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..డయల్ 100,పెట్రో కార్,నైట్ పెట్రోలింగ్, హైవే పెట్రోలింగ్,బ్లూ కోట్స్,బీట్ డ్యూటీలను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు.ఎక్కడ ప్రమాదాలు సంభవించినా సమస్యలు వచ్చినా నేరుగా అధిక సంఖ్యలో డయల్ 100 కు ఫిర్యాదులు వస్తున్నాయని, ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించి సిబ్బంది బాధితులకు పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు.కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అనుమానిత కదలికలు గమనిస్తూ సంబంధిత పోలీసు వారికి సమాచారం అందించి,నేరాల నివారణలో కృషి చేయాలన్నారు.ప్రతి అంశాన్ని సెంట్రల్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారని వేగంగా సేవలందించడం ద్వారా జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు వస్తుందన్నారు.జిల్లా పోలీస్ కంట్రోల్ సెంటర్ నుండి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం, సమన్వయం చేస్తూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,పోలీస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్,పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలి

**యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశం**

**ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**

ధర్మఘంట జనవరి 16 భువనగిరి





ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు,సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల లభ్యత తదితర అంశాలను పరిశీలించారు.ప్రతి రోజు ఓపీ విభాగంకు ఎంతమంది పేషంట్లు వస్తున్నారని,గర్భిణీ స్త్రీలు చెకప్ కు ఎంతమంది వస్తున్నారని,ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు.గర్భిణీలు సమయానికి వచ్చి చెకప్ చేయించుకునేలా ఆశాలు గర్భిణీలతో ఎప్పటికప్పుడు ఫోన్ లో మాట్లాడి వారి ఆరోగ్యం ఎలా ఉందని అడిగి,ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపి,సమయానికి వచ్చి అన్ని పరీక్షలు చేయించుకోవాలని గర్భిణీలకు తెలపాలన్నారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై, డాక్టర్లు సమయానికి వచ్చి చెక్ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో మధ్యాహ్నం భోజనం పెడుతున్నా విషయం అడిగి, భోజనం రుచిగా ఉంటుందా లేదా అని ఆరా తీశారు.ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని,ఆసుపత్రి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్,వైసీపీ నేతలు రాష్ట్రాలను సర్వనాశనం చేయడానికి కుట్రలు

## టిడిపి నేత వంచ శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు

ధర్మఘంట జనవరి 16 కరీంనగర్

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరుకుంటున్నారని,కానీ, బీఆర్ఎస్ (టీఆర్ఎస్),వైసీపీ నాయకులు రాష్ట్రాలను సర్వనాశనం చేయాలని కుట్రలు చేస్తున్నారని టిడిపి నేత వంచ శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నుండి ఓ ప్రకటన విడుదల చేశారు.కృష్ణ,గోదావరి జల వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పినా,ఈ రెండు పార్టీలు వివాదాలను రెచ్చగొడుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.నమస్తే తెలంగాణ,సాక్షి పత్రికలు తప్పుడు కథనాలతో (మ్యాచ్ ఫిక్సింగ్ వంటివి) తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని,వీటిని రద్దు చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్-వైసీపీల మధ్య 'ఫెవికాల్ బంధం'తో నీటి విషయంలో డ్రామాలు ఆడుతున్నారని,హరీష్ రావు నమస్తే తెలంగాణలో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తామే ఆపామని ప్రకటించినా,వైసీపీ నాయకులు క్రెడిట్ కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు.ఇలాంటి కుట్రలతో చంద్రబాబును 'సీమ ద్రోహి' అని నిందించడం అర్థం లేనిదని, రాయలసీమ ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే పూర్తయ్యాయని చెప్పారు.జగన్ సొంత వ్యాపారాల కోసం కేసీఆర్‌తో కుమ్మక్కై ఏపీ ప్రాజెక్టులను ఆపారని ఆరోపించారు.జగన్ పాలన చీకటి అధ్యాయమని, ఇప్పుడు మళ్లీ 'ముక్కోడు-తిక్కోడు' జతకట్టారని విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమను సస్యశ్యామలం చేసే దిశగా పనులు జరుగుతున్నాయని, బీఆర్ఎస్-వైసీపీలు బురద చల్లడం మానుకోవాలని,కూటమి ప్రభుత్వం ముందు వారి కుట్రలు సాగవని,వారు ఫామ్‌హౌస్-ప్యాలెస్‌లకే పరిమితమవ్వాలని జోస్యం చెప్పారు.ప్రజలు ఈ రెండు పార్టీల మోసపూరిత కుట్రలను తిప్పికొట్టాలని,ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.




# విదేశాల్లో ఉన్నత చదువులు,ఉద్యోగాలు ఇప్పిస్తానని ఘరానా మోసం






**8 మంది నుండి సుమారు రూ.85 లక్షలు వసూల్**

**ఓ బాధితుడి ఫిర్యాదుతో చింతపల్లి పీఎస్ లో కేసు నమోదు**

**అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసిన చింతపల్లి పోలీసులు**

**వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ జి.రమేష్**



ధర్మఘంట జనవరి 16 చింతపల్లి:

విదేశాల్లో ఉన్నత చదువులు చదివించి,మంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేస్తూ,ఘరానా మోసానికి పాల్పడిన అంతర్రాష్ట్ర నిందితుడిని చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఏఎస్పీ జి.రమేష్ మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన ముప్పాళ్ల లీలాకృష్ణ(35) తండ్రి వెంకట్రావు అనే ప్రైవేట్ ఉద్యోగి,గతంలో విదేశాల్లో ఉద్యోగం చేసి,తిరిగి వచ్చిన తర్వాత చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో విదేశాలకు పంపి ఉన్నత చదువులు చదివించి,ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఇప్పటివరకు 8 మంది విద్యార్థుల నుండి సుమారు రూ.85 లక్షలు తీసుకొని మోసం చేశాడు.ఇక నల్లగొండ,వరంగల్ జిల్లాల్లో కూడా పలువురి నుండి భారీ మొత్తంలో డబ్బులు తీసుకొని ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు తేలింది.ఇలా అక్రమంగా సంపాదించిన డబ్బును విలాసాలకు,జల్సాలకు ఖర్చు చేశాడు.నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్‌కు చెందిన కోయలకార్ కరుణ భాయ్ కుమారుడిని విదేశాలకు పంపి ఉన్నత చదువులు చదివించి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశారనే ఆరోపణపై చింతపల్లి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మాల్ గ్రామం మర్రిగూడ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.అతని నుండి ఒక ల్యాప్‌టాప్,మూడు స్మార్ట్‌ఫోన్లు, వివిధ బ్యాంకుల డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.అతడిపై మాడుగులపల్లి పీఎస్‌లో క్రైమ్ నెంబర్.253/2025(తేదీ:24-12-2025) మరియు వరంగల్ ఏజే మిల్స్ కాలనీ పీఎస్‌లో క్రైమ్ నెంబర్.24/2026 (తేదీ: 10-01-2026) చీటింగ్ కేసులు నమోదై ఉన్నాయి.ఈ కేసు విషయంలో బాగా పని చేసిన నాంపల్లి సీఐ డి.రాజు,చింతపల్లి ఎస్ఐ ఎం.రామ్మూర్తి,చింతపల్లి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.యువతను లక్ష్యంగా చేసుకొని ఉద్యోగాలు, ఉన్నత చదువులు ఇప్పిస్తామని మోసగాళ్లు నమ్మిస్తున్నారని, ముందస్తు డబ్బులు అడగడం, నకిలీ పత్రాలు చూపించడం, వాట్సాప్/ఫోన్ కాల్స్ ద్వారా తప్పుడు హామీలు ఇవ్వడం వంటి పద్ధతులు ఉపయోగిస్తున్నారని,అధికారిక నోటిఫికేషన్లు,గుర్తింపు పొందిన సంస్థలు,ప్రభుత్వ వెబ్‌సైట్ల ద్వారానే సమాచారం పొందాలని, మోసాలకు గురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని,ఇలాంటి మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని,యువత జాగ్రత్తగా ఉండి పోలీస్ శాఖకు సహకరించాలని అడిషనల్ ఎస్పీ జి.రమేష్ విజ్ఞప్తి చేశారు.


## పరిశ్రమలకు నిబంధనల మేరకు సకాలంలో అనుమతులు జారీ చేయాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సమావేశం**

**హాజరైన జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ,టి.జి.ఐపాస్ కమిటీ**


ధర్మఘంట జనవరి 16 సూర్యాపేట




జిల్లాలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల గురించి 49 పరిశ్రమలకు గాను 119 అప్రూవల్స్ వివిధ శాఖల ద్వారా వచ్చాయని,వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు నిబంధనల మేరకు ఆమోదించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని విసి హాల్ లో "జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ మరియు టి.జి.ఐపాస్ కమిటీ" సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమావేశంలో టి-ప్రైడ్ (టి-పీఆర్ఐడిఈ)పథకం కింద 143 మంది లబ్ధిదారులకు రాయితీ మంజూరు చేయడం జరిగిందని,జిల్లాలోని రైసుమిల్లులు,ఫార్మా అలాగే సిమెంట్ పరిశ్రమలు భద్రతా నిబంధనలు,తీసుకుంటున్న జాగ్రత్తలపై త్వరలో అధికారులతో యాజమాన్యంతో సమావేశం నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి.సీతారాం,కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి.యాదగిరి,డిపిఓ కె. యాదగిరి,ఆర్టీఓ జయప్రకాష్ రెడ్డి,ఎస్సీ డెవలప్మెంట్ అధికారిణి దయానందరాణి,ఎస్టీ డెవలప్మెంట్ అధికారి కె.శంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

ధర్మఘంట జనవరి16 కరీంనగర్:



కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యాంప్ కార్యాలయంలో పల్లె సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో అలంకరించగా, సిబ్బంది పండుగ వాతావరణంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ...సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసే ముఖ్యమైన పర్వదినమని తెలిపారు.వ్యవసాయం,ప్రకృతి, కుటుంబ బంధాల ప్రాధాన్యతను ఈ పండుగ ప్రతిబింబిస్తుందన్నారు.అధికారులు,ఉద్యోగులతో కలెక్టర్ ఆత్మీయంగా మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల మధ్య ఐక్యత మంచి వాతావరణం పెంపొందించేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు,సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

